



జగన్నాథ గట్టుపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి నారపరెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణకాంత్

నిమిషం ఆలస్యమైనా..!

అనుమతి లేదు...

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు - పూర్తయిన ఏర్పాట్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరించనున్నారు. పరీక్షలకు సంబంధించి అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు...

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి 20 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75,814 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం 121 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించకూడదని ఇంటర్ బోర్డు నుంచి ఇప్పటికే ఆదేశాలందాయి. హాల్‌టికెట్లను ఇప్పటికే ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్లలో ఉంచారు. కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా మంచి నీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. అవకతవకలు, మాస్ కాపీయింగ్కు పాల్పడ కుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు, కర్నూలు నగరంలోని ఇంటర్ ప్రాంతీయ కార్యాలయానికి అనుసంధానం చేశారు. కర్నూలు జిల్లాలో మొత్తం 69 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల విద్యార్థులు మొత్తం 47,412 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్ష ప్రశ్నపత్రాలు నిల్వ చేసేందుకు 23 కేంద్రాలు ఏర్పాటు చేశారు. డిపార్టుమెంట్ ఆఫీసర్లు 69 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు 69 మంది, కస్టోడియన్లు ఐదుగురు, ఫ్లయింగ్ స్క్వాడ్లు ముగ్గురు, సిట్టింగ్ స్క్వాడ్ ఆరుగురు, ఒక హైపవర్ కమిటీ, డీఈసీ కమిటీలు 4, డీవీఈవోలు 2 ఇద్దరు, ఇన్విజిలేటర్లను సుమారు 1,000 మందిని నియమించారు. నంద్యాల జిల్లాలో 52 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 28,402 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కర్నూలు జిల్లాలో 5, నంద్యాలలో 4 సమస్యాత్మక పరీక్ష కేంద్రాలు గుర్తించారు. ఆలూరు, పత్తికొండ, దేవ నకొండ, కోసిగి, చిప్పగిరి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు.



పకడ్బందీ చర్యలు చేపట్టాం

నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలి. సమస్యాత్మక కేంద్రాల్లో రెండింతల పకడ్బందీ చర్యలు చేపట్టాం. ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించాం. ఇన్విజిలేటర్లు, విద్యార్థులు సెల్‌ఫోన్లను తీసుకెళ్లకూడదు. సమాచార సేకరణకు ఇంటర్ బోర్డు అందజేసిన కీప్యాడ్ ఫోన్లు అందజేశాం. వీటిని మాత్రమే వాడాలి. పరీక్ష కేంద్రాల్లో ఏమైనా సమస్య లుంటే కంట్రోల్ రూం నంబరు 08518 222047కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయచ్చు.

- గురువయ్యశెట్టి, ఆర్ఐఓ

4న కర్నూలుకు సిఎం రాక

- న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన
- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జగన్నాథగట్టుపై నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈనెల 4న శంకుస్థాపన చేయనున్నట్లు జెసి నారపురెడ్డి మౌర్య తెలిపారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఎస్పీ కృష్ణకాంత్, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజతో కలిసి జెసి నారపురెడ్డి మౌర్య గురువారం హెలిప్యాడ్, వేదిక స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పైలాన్, సభా వేదిక ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాటుపై జెసి, ఎస్పీ చర్చించారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు పలు ప్రాంతాలను పరిశీలించారు. కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, డీఎస్పీ విజయ శేఖర్, ఆర్అండ్‌బి ఎస్ఇ నాగరాజు, ఇఇ సురేష్ బాబు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రూ.11లకే రాగి పిండి

జిల్లాలో ఈనెల 1 నుంచి కార్డుదారులకు రూ.11లకే కిలో రాగి పిండి పంపిణీ చేస్తున్నట్లు జెసి నారపురెడ్డి మౌర్య తెలిపారు. గురువారం జెసి నారపురెడ్డి మౌర్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 1 నుంచి కార్డుదారులకు రూ.11లకే కిలో రాగి పిండిని ఎమ్‌డియు వాహనం ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో కిలో రాగి పిండి ధర దాదాపు రూ.40 ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే కార్డుదారుల ఎంపిక ప్రకారం బియ్యానికి బదులుగా జొన్నలు/రాగులను అందజేస్తామని తెలిపారు. కర్నూలు జిల్లాకు 6,76,209 కార్డులకు గాను 11,857 టన్నుల బియ్యం, 360 టన్నుల చక్కెర, 676 టన్నుల రాగి పిండి, 671 టన్నుల జొన్నలు, 126 మెట్రిక్ టన్నుల రాగులు కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో రైతుల దగ్గర నుంచి 850 టన్నుల జొన్నలను పౌర సరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేసి కార్డుదారులకు అర్హత మేరకు జొన్నలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. వంటగ్యాస్ పంపిణీ విషయంలో వినియోగదారుల నుంచి ఏజెంట్ కార్యాలయం నుంచి 15 కిలోమీటర్లలోపు ఉన్న వినియోగదారుల నుంచి ఎలాంటి రవాణా రుసుం వసూలు చేయరాదన్నారు. గ్యాస్ ఏజెన్సీ వారి నుండి 15 కిలోమీటర్ల లోపల ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి, 15 కిలోమీటర్లు దాటి ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి అన్న వివరాలను గ్యాస్ ఏజెన్సీ నుంచి సేకరించి సమర్పించాలని డిఎస్ఒను ఆదేశించారు. జిల్లాలో జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతంగా సాగుతున్నాయని, ఇప్పటివరకు జిల్లాలో 62,440 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లు కూడా త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. డిఎస్ఒ కెఎస్‌విఎం.ప్రసాద్, సివిల్ సప్లయి కార్పొరేషన్ జిల్లా మేనేజర్ షర్మిల పాల్గొన్నారు.

న్యాయమైన నష్టపరిహారమివ్వాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆరు లైన్ల బాధిత రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాధిత రైతులతో కలిసి డిఆర్ఒ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి, అనంతరం ఆర్బిట్రేషన్ పత్రాలతో డిఆర్ఒ మధుసూదన రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం ఆరు లైన్ల రోడ్డు కోసం వందలాది ఎకరాలు సేకరిస్తోందని తెలిపారు. రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. బాధిత రైతుల భూములు రూ.కోట్ల విలువ చేస్తుంటే ప్రభుత్వం రూ.12.50 లక్షలు మాత్రమే పరిహారం చెల్లిస్తోందని తెలిపారు. తక్కువ పరిహారం ఇవ్వడం అన్యాయమని విమర్శించారు. ఇదివరకే 60 మంది దాకా రైతులు ఆర్బిట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారని, కలెక్టర్‌కు 30 శాతం పెంచడానికి అవకాశం ఉన్నప్పటికీ కలెక్టర్ కేవలం 10 శాతం పెంచి రైతులను అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతుల భూములు కర్నూలు నగరానికి కూతవేటు దూరంలో ఉన్నాయన్నారు. రెండుసార్లు, మూడుసార్లు పంటలు వేసుకునే సారవంతమైన భూములు అని తెలిపారు. అలాంటి భూములకు తక్కువ పరిహారం ఇవ్వడం రైతులను అన్యాయం చేయడమే తప్ప మరొకటి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ ఆలోచించి అవకాశమున్న 30 శాతం పెంచడానికి కృషి చేయాలని కోరారు. ఇంకా ఆన్‌లైన్ లోపం వల్ల రైతులకు పూర్తి నష్టపరిహారం రాక, భూములు కోల్పోయి లబోదిబోమంటున్నారని తెలిపారు. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నప్పటికీ వారి భూములు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని చెప్పారు. వారి దగ్గర అన్ని రకాలుగా హక్కు పత్రాలు కూడా ఉన్నాయని, కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆన్‌లైన్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, బాధిత రైతులు సుంకన్న, పెద్ద కర్రెన్న, నాగన్న, రంగన్న, మద్దిలేటి, కర్ణ, జమ్మన్న, వెంకట్రాముడు, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.




డిఆర్ఒకు వినతి పత్రం అందజేస్తున్న రామకృష్ణ, నాయకులు

వైసిపిలోకి ఐఎఎస్ అధికారి

- ముందస్తుగా ఉద్యోగానికి రాజీనామా - కర్నూలు అసెంబ్లీ సీటుపై ఇంతియాజ్ అహ్మద్ దృష్టి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ఇది వరకు రాష్ట్రంలో ఐఎఎస్ అధికారిగా విధులు నిర్వహించిన ఎఎండి.ఇంతియాజ్ అహ్మద్ గురువారం విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో వైసిపిలోకి చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత కొద్ది రోజులుగా ఇంతియాజ్ వైసిపిలో చేరుతున్నారన్న అంశం చర్చకు వచ్చిన సంగతి తెలిసిందే. 2009లో ఆయన ఐఎఎస్‌గా ఎంపికయ్యారు. ఆయన సెర్ప్ సీఈవోగా, మైనార్టీ సంక్షేమ శాఖ సెక్రెటరీగా విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. వైసిపి రాజకీయాల్లోకి ఆహ్వానించడంతో ఆయన విఆర్ఎస్ తీసుకుని తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. బుధవారం ఉదయం ఆయన రాజీనామా సమర్పించగా సాయంత్రానికే ప్రభుత్వం ఆమోదించింది. ఆయనను కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసిపి అధిష్టానం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ముస్లింల ఓట్లను ఆకర్షించే నేపథ్యంలోనే ఆయనను పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈయన ప్రభుత్వంలో అధికారిను వ్యక్తిగతంగాను విబేధాలు లేని వ్యక్తిగా ఉండడం, కర్నూలు జిల్లాలో సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతూ మానవతా దృష్టి కలిగిన వ్యక్తిగా, కర్నూలు పేదల డాక్టర్ ఇస్మాయిల్ కుటుంబ సంబంధాలు ప్రత్యక్షంగా కలిగిన వ్యక్తిగానూ పార్టీకి కలిసి వచ్చే అవకాశం ఉందని వైసిపి భావించినట్లు తెలుస్తోంది. ఆయన కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గంలో గ్రూపు తగాదాలు తీవ్రస్థాయిలో ఉండడంతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న ఆందోళన నేపథ్యంలో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి వైసిపి ఈ ఎన్నికల్లో ఆయనను బరిలోకి దించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నా యి. ఈ నేపథ్యంలోనే కర్నూలు నియోజకవర్గంలోని ఇరు గ్రూపు నాయకులు, పార్టీ పెద్దల సమక్షంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ సాగుతోంది. దాదాపు ఈనెల 4వ తేదీ ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించ నున్న నేపథ్యంలో దాదాపు ఈ చర్చకు తెరపడే అవకాశం ఉన్నట్లు పార్టీ క్యాడర్‌లో చర్చ సాగుతోంది.



ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన ఇంతియాజ్ అహ్మద్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎస్వీ.మోహన్‌రెడ్డి, మేయర్ రామయ్య

సెలవుల్లో ఉన్న ఉద్యోగులను విధుల్లో చేరాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో ఆయా శాఖలో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న ఉద్యోగులను వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సృజన అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు లక్ష 56 వేల కార్డులు పంపిణీ చేశారన్నారు. నందవరం, మంత్రాలయం, కోసిగి, ఆస్పరి, హలహర్వి, ఆదోని అర్బన్, గోనెగండ్ల తదితర మండలాల్లో మాత్రం కేవలం 10 నుండి 15 శాతమే పంపిణీ చేశారన్నారు. పంపిణీలో పురోగతి తీసుయకురావాలని సంబంధిత ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఫార్మ్స్‌కు సంబంధించి నిన్న 6 వేల దరఖాస్తులు డిస్పోజ్ చేశామని, 7 రోజుల గడువు దాటిన దరఖాస్తులను ఈరోజులోపు డిస్పోస్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం–7కి సంబంధించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుండి అనుమతి వచ్చిన వాటిని మాత్రమే డిస్పోస్ చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.

బాబు, పవన్‌లకు ప్రజలే బుద్ధి చెబుతారు

- జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : నక్కల్లా మొరిగితే సింహం లాంటి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బెదరరని, రాబోయే ఎన్నికల్లో బాబు, పవన్‌లకు ప్రజలే బుద్ధి చెబుతారని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం సుభాష్ చంద్రబోస్ తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని ఓడిస్తామని ఉత్తర కుమారుల్లా ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబుకు అంత దమ్ములేదని, పవన్ కళ్యాణ్‌కు ప్రజల్లో అంత సీనులేదని ఎద్దేవా చేశారు. దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎపిలో అమలు చేశారని, ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని తెలిపారు. గతంలో కంటే అత్యధిక మెజారిటీతో జగన్ మోహన్ రెడ్డి మళ్ళీ సిఎం కావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

ప్రజాశక్తి - పత్తికొండ : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 75వ రథోత్సవ వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవాన్ని ఆశేష భక్త జన సందోహం నడుమ ఊరేగించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కేఈ శ్యాంబాబులు వేరువేరుగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. డిఎస్పి శ్రీనివాసరెడ్డి, అర్బన్ సిఐ మురళీమోహన్‌ల నేతృత్వంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అశేష భక్త జన సందోహం నడుమ
వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం



దళితుల భూములకు రక్షణ కల్పించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం మునగాలపాడు గ్రామంలో ప్రభుత్వ అక్రమణకు గురవుతున్న దళితుల భూములకు రక్షణ కల్పించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదిర్శ ఎండి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు మండలం మునగాల పాడు గ్రామంలో ప్రభుత్వ ఆక్రమణకు గురవుతున్న దళితుల భూములను కెవిపిఎస్ ప్రతినిధి బృందం పరిశీలించి, బాధిత దళితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగాలపాడు గ్రామంలో కెసి కెనాల్ పక్కన 100 సంవత్సరాలుగా 60 కుటుంబాల దళితులు భూములు సాగు చేసుకుంటూ బతుకుతున్నారని, విలువైన భూములను కర్నూల్ నగర ప్రజల తాగునీటి అవసరం కోసం అంటూ మొదట 15 ఎకరాలను స్వాధీనం చేసుకుని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించారన్నారు. దాని పక్కనే ఉన్న మరో ఐదు ఎకరాలను, దళితులు పంట వేసుకోకుండా కెసి కెనాల్ నుండి పైపు ద్వారా నీళ్లను వదిలి, జంబుగడ్డి పెరిగేలా నిల్వ ఉంచి దాన్ని కూడా ఆక్యుపై చేసుకుంటూ పోతోందన్నారు. భూములు సాగు చేసే రైతులకు ఎలాంటి నోటీస్ కూడా ఇవ్వకుండా ఆక్యుపై చేసుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. పట్టా పాస్ బుక్కులు ఇచ్చి సంవత్సరాల తరబడి ఆన్లైన్లో పేరు ఎక్కించకుండా, లాక్కోవడానికి వీలుగా పెట్టారన్నారు. కెసి కెనాల్‌కు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి పెద్దల చేతిలో ఉన్నది ఆన్లైన్లో ఎక్కితే వంద సంవత్సరాలుగా పేదల అనుభవంలో ఉన్న భూమి ఎందుకు ఎక్కలేదని వారు ప్రశ్నించారు. దళితుల భూములను దళితులకే అప్పజెప్పి వారు ఆత్మగౌరవంగా బతికేందుకు హక్కు కల్పించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి కృష్ణ, విజయమ్మ, గంధం ఉసేనమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆంధ్ర గురుస్వామి, భాస్కర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కెవిపిఎస్ నాయకులు



వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ఎంపిపి బోయ శారద, సర్పంచి బి.మద్దిలేటి తదితరులు

వాలంటీర్లకు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలంలోని వాలంటీర్లకు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వందనం కార్యక్రమం నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. వాలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. మండల వాలంటీర్లకు వజ్ర రత్న, మిత్ర అవార్డ్స్, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శారద, ఉలిందకొండ, కల్లూరు పిఎసిఎస్ అధ్యక్షులు కెవి రమణారెడ్డి, శివ శంకర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కురువ పెద్ద ఈశ్వరయ్య, ఎంపీడీవో జీవీ రమణమూర్తి, మండల ఉపాధ్యక్షులు ఎన్.చంద్రశేఖరెడ్డి, కేశవరెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, ఉలిందకొండ రమణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, రామకష్ణ రెడ్డి, సత్యంరెడ్డి, మస్తాన్ నూరా హనుమంత రెడ్డి, సుంకన్న, వేణుగోపాల్ రెడ్డి, అభి, బోయ రవి, ఈశ్వరయ్య, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

- ఒక్కో కుటుంబానికి
రూ.5 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

సుందరయ్య నగర్‌లో అగ్ని ప్రమాదంలో మూడు గుడిసెలు కాలిపోయిన సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య నగర్‌లో అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గుడిసెలను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, సుందరయ్య నగర్ కార్యదర్శి ఎం.దావీదు, ఇ.రామాంజనేయులు, ఎస్.ముక్తార్‌లు మాట్లాడారు. మూడు కొట్టాలలో మద్దమ్మ, శివమ్మల గుడిసెలు పూర్తిగా, కాశమ్మ కొట్టం పాక్షికంగా కాలిపోయాయని చెప్పారు. సరుకులు, బియ్యం, వస్తువులు, ఫ్యాన్లు, బీరువా, 30 వేలు నగదు, బట్టలు, ఇంటికి సంబంధించిన రెవెన్యూ పట్టా కాగితం మొత్తం కాలి బూడిదయ్యాయని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేనందున ప్రాణనష్టం జరగలేదన్నారు. స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేశారని, అగ్ని మాపక కేంద్రం వారు రావడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. నిరుపేదలైన బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, పక్కా గృహం నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - వెల్దుర్తి : వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వారాది చిన్న మాదన్నకు ఆపరేషన్ నిమిత్తం సిఎం సహాయనిధి నుండి మంజూరయిన రూ. 15 లక్షలకు సంబంధించి ఎల్ఒసి పత్రాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం కర్నూల్‌లోని ఆమె స్వగృహంలో బాధితుడికి అందజేశారు. మాదన్న కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అధిష్టానం ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - తుగ్గలి : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే పత్తికొండ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అడ్వకేట్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం తుగ్గలిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1983 నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని, 41 సంవత్సరాలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశానని తెలిపారు. పత్తికొండ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

ప్రతి ఏటా శ్రీశైలంకు కాలినడకన యాత్ర

ప్రజాశక్తి - సి.బెళగల్ : మండలంలోని బ్రాహ్మణదొడ్డికి చెందిన శంకరన్న గత 31 ఏళ్లుగా శివమాల ధరించి శ్రీశైలంకు ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా కాలినడకన యాత్ర సాగిస్తున్నాడు. గురువారం శ్రీశైలానికి కాలినడకన బయల్దేరాడు. ఏటా మహా శివరాత్రి సందర్భంగా 10 రోజులు ముందే కాలినడకన వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నాడు.

టిడిపి గెలుపునకు కృషి చేయలి : కెఇ

ప్రజాశక్తి - మద్దికెర : రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయలని పత్తికొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కెఇ శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని ఎడవల్లి గ్రామంలో ఆయన పార్టీ కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి తిమ్మప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమి లేదని అన్నారు. 8 సార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజలు నడ్డి విరిచారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల ఆనంద్, నంది జయ రాముడు, యువ నాయకులు ఆకుల వేణుగోపాల్, సంజీవ రాయుడు, జయన్న, వెంకట రాముడు, ఐ టిడిపి కన్వీనర్ హుస్సేన్ పీరా, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : అంబేద్కర్‌ను అవమానిస్తూ ప్రశ్నాపత్రంలో ప్రశ్నలు తయారు చేయించిన ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామలను ఆ సంఘం నాయకులు రామశేషయ్య, భాస్కర్, సుధాకర్‌లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8వ తరగతి ఫార్మేటివ్ అసెస్మెంట్ సాంఘిక సంక్షేమ శాస్త్రం పరీక్ష ప్రశ్నాపత్రంలో అంబేద్కర్‌ను అవమానించే విధంగా ప్రశ్నలు తయారు చేశారన్నారు. కేవలం అంబేద్కర్‌ను దళితులకు పరిమితం చేయడం తగదని పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరంలో తాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూల్ నగర మునిసిపల్ కమిషనర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. సుంకేసుల జలాశయంలో నీటి మట్టం అడుగంటడంతో నగర ప్రజలు తాగు నీటి ఎద్దడిని ఎదుర్కనే క్లిష్ట పరిస్థితిని ముందుగానే గుర్తించి కమిషనర్ మూడు రోజుల పాటు నిర్విరామంగా 70 కిలోమీటర్ల మేర కెనాల్‌లోని అడ్డంకులను తొలగింపచేస్తూ, గాజులదిన్నె ప్రాజెక్ట్ (జిడిపీ) జలాశయం నుండి మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు నీటి ప్రవాహాన్ని విజయవంతంగా మళ్లించారు. గురువారం జిడిపి నుండి విడుదల చేయించిన 30 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి జి.సింగవరం వద్ద కమిషనర్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఈఈ.రవిప్రకాష్ నాయుడు, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సుంకేసుల బ్యారేజ్ వద్ద పనులు పరిశీలన : సుంకేసుల బ్యారేజ్ వద్ద జరుగతున్న ఇంటెక్ వెల్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కర్నూల్ నగరపాలక సంస్థకి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయబడుతుందని, తద్వారా నీటి చౌర్యాన్ని అరికట్టవచ్చని, రాబోవు కాలంలో వేసవి నందు నీటి సమస్య తలెత్తకుండా ఉండుటకు తోడ్పడుతుందని కమిషనర్ తెలిపారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ మహా రథోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

కోసిగిలో వెలసిన శ్రీరేణుక ఎల్లమ్మ రథోత్సవం గురువారం అశేష జనవాహిని మధ్య రమణీయంగా సాగింది. కోసిగిలో వెలసిన శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ సందర్భంగా ఆలయ అర్చకులు ఉమేష్ గౌడ్, మల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమార్చన, ఫల, పుష్ప అలంకరణ, మహా మంగళ హారతులు వంటి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆనవాయితీ ప్రకారం మొదటి కుంభం దొరల వంశస్తుల ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి గుడి వద్ద సమర్పించారు. దొరల వంశస్తుల నుంచి మురళీధర్, శ్రీనివాస్ దొర కుటుంబ సభ్యులు రథోత్సవానికి మొదట పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవం కనుల పండువగా సాగింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, కోసిగి సిఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

ఎల్లమ్మ మహా రథోత్సవంలో వైసిపి నాయకులు

కోసిగిలో జరిగిన శ్రీరేణుక ఎల్లమ్మ దేవి మహా రథోత్సవంలో వైసిపి యువ నేత వై.ప్రదీప్ రెడ్డి, మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. గురువారం శ్రీరేణుక ఎల్లమ్మ దేవి జాతర సందర్భంగా ఆలయం చేరుకున్న వారు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మహా రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు వారు నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. జాతరకు హాజరయిన వారికి వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.


పాల్గొన్న ప్రదీప్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి

దాతృత్వం చాటుకున్న విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి మరోసారి దాతృత్వం చాటుకున్నారు. ఆలూరు నియోజకవర్గం హోళగుంద మండలం కోగిలతోట గ్రామంలో ఈనెల 3, 4న శివ స్వాముల ఆధ్వర్యంలో జరిగే సామూహిక వివాహానికి ముఖ్యఅతిథిగా రావాలని గురువారం విరుపాక్షిని ఆహ్వానించారు. ఈ సామూహిక వివాహాలకు స్పందించి ఆయన రూ.50 వేల సహాయం అందజేశారు. ఇందుకుగాను శివ స్వాములు విరుపాక్షిని పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడారు. సామూహిక వివాహాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని, కుల, మతాలకు అతీతంగా పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉండాలని తెలిపారు. సామూహిక వివాహాల్లో వివాహం చేసుకునే నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. గజ్జల్లి సవారి, పైగారి దేవన్న, కురువ ఉచ్చరంగస్వామి, కురువ చంద్రప్ప, పంపాపతి, వెంకటేశ్ పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న విరుపాక్షి

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆకాంక్షించారు. గురువారం కోసిగిలో శ్రీఎల్లమ్మ దేవి మహా రథోత్సవంలో టిడిపి శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించాలని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. తిక్కారెడ్డికి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డికి టిడిపి కోసిగి మండల నాయకులు, కార్యకర్తలు డ్రమ్స్ వాయిద్యాలతో, పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ జ్ఞానేష్, తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరద్వాజ్ శెట్టి, సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, టౌన్ అధ్యక్షులు పంపాపతి, కొండగేని వీరారెడ్డి, సాతనూరు కోసిగయ్య, నాడిగేని వీరారెడ్డి, నర్సారెడ్డి, వడ్డే రామయ్య, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉమర్ సాబ్, గోపాల్, లక్ష్మీకాంత్, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ, చిన్న భూంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, వందగల్ మాజీ సర్పంచి నరసింహులు, జంపాపురం మాజీ సర్పంచి కృష్ణా రెడ్డి, పల్లెపాడు మాజీ సర్పంచి చంద్ర, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మారెప్ప, ఎంపిటిసి సభ్యులు రాజు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న తిక్కారెడ్డి

నీటిని పొదుపుగా వాడుకోవాలి

- సర్పంచి రాధమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచి మూలింటి రాధమ్మ సూచించారు. గురువారం స్థానిక సచివాలయం-1లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే మూడు నెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయని, వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటిని ఆదా చేసుకోవాలని తెలిపారు. మేజర్ పంచాయతీ అయిన ఆస్పరిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. గతేడాది కంటే ఈఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని తెలిపారు. ముఖ్యంగా మేజర్ పంచాయతీలో నీటి సమస్య పరిష్కారానికి పంచాయతీ పరిధిలో ఉన్న చేతి పంపు బోర్లను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. నాగనాథనహళ్లి వాటర్ స్కీం నుంచి ఆస్పరికి రావాల్సిన తాగునీరు సక్రమంగా రావడం లేదని తెలిపారు. అక్కడక్కడ పంట పొలాల్లో వాటర్ స్కీం పైపులైను లీకేజీలు గుర్తించామని, లీకేజీలు ఏర్పడిన చోట మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు తెలిపామని అన్నారు. మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీటి సమస్య నెలకొన్న వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఇఒఆర్‌డి నరసింహా రెడ్డి, జిల్లా కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, ఇన్‌ఛార్జీ పంచాయతీ సెక్రటరీ కృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచి రాధమ్మ

అక్రమాలకు అడ్డుకట్టేది..?

- సబ్సిడీ అక్రమ బియ్యానికి హోళగుంద అడ్డా - గవి సిద్ధేశ్వర రైస్ మిల్లులో జోరుగా దందా
రూ.లక్షల్లో అక్రమార్జన - చోద్యం చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

ప్రభుత్వం పేదలకు అందించే సబ్సిడీ బియ్యాన్ని కారుచౌకగా కొని పాలీష్ చేసి అక్రమార్కులు దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. కార్డుదారుల నుంచి చిన్న, చిన్న వ్యాపారులు రూ.15లకు కొనుగోలు చేసి రైస్ మిల్లులో రూ.20 విక్రయిస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎమ్‌డియు ఆపరేటర్ల చేతివాటం

మండలంలో 17 పంచాయతీలకు గాను 32 రేషన్ షాపులు ఉన్నాయి. 17,204 మంది కార్డుదారులు ఉన్నారు. మండలానికి నెలకు 2,597.38 క్వింటాళ్ల బియ్యం అలాట్‌మెంట్ అవుతోంది. ఇంటింటికీ మొబైల్ వాహనం ద్వారా రేషన్ అందించే ఎమ్‌డియు ఆపరేటర్లు బియ్యం పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తూకంలో మోసం చేసి కార్డుదారుల నుంచి బియ్యాన్ని నొక్కేస్తున్నారు. గతంలో రేషన్ డీలర్లు ఈ తతంగాన్ని నడిపేవారు. ప్రస్తుతం ఎమ్‌డియు ఆపరేటర్లు ఈ వ్యవహారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా మార్చుకుని దోచుకుంటున్నారు. కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని రైస్ మిల్ యజమానులకు కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది కింటాళ్లలో రైస్‌మిల్‌కు తరలించి రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. ఒక్క హోళగుంద మండలం నుంచే నెలకు 1200 కింటాళ్ల వరకు సబ్సిడీ బియ్యం అక్రమంగా బ్లాక్‌మార్కెట్‌కు చేరుతున్నట్లు సమాచారం. ఎమ్‌డియు ఆపరేటర్ల చేతివాటం, గ్రామాల్లో చిన్న, చిన్న వ్యాపారులు కొనుగోలు చేసిన 1200 కింటాళ్ల బియ్యం ఒక్క హోళగుంద నుంచే అక్రమంగా తరలి వెళ్తోంది. ఇక నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతినెలా 820 మెట్రిక్ టన్నుల బియ్యం అలాట్‌మెంట్ అవుతోంది. 53,927 మంది కార్డుదారులు ఉన్నారు. ఇంకెంత అక్రమం జరుగుతుందో ఇట్టే అర్థమవుతోంది.

గవి సిద్ధేశ్వర రైస్ మిల్‌లో జోరుగా దందా

హోళగుంద గవి సిద్ధేశ్వర రైస్ మిల్లులో అక్రమ బియ్యం దందా జోరుగా సాగుతోంది. చిన్న, చిన్న వ్యాపారులు, ఎమ్‌డియు ఆపరేటర్లు కిలో రూ.20 ప్రకారం రైస్ మిల్ యజమానికి అమ్ముతున్నారు. ఈ రైస్ మిల్లులో సబ్సిడీ బియ్యాన్ని డబుల్ పాలీష్ చేసి చిన్న బియ్యంగా మార్చి కిలో రూ.40 ప్రకారం బహిరంగ మార్కెట్‌లో అమ్ముతున్నట్లు సమాచారం. ప్రతినెలా 8 నుంచి 10 లారీల వరకు పాలీష్ చేసిన బియ్యం పక్కనున్న కర్ణాటక రాష్ట్రానికి తరలించి గవి సిద్ధేశ్వర రైస్‌మిల్ యజమాని రూ.లక్షల్లో సంపాదిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

సబ్సిడీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో పట్టుకొని రాజకీయ నాయకులకు ఒత్తిడితో వదిలిపెట్టినట్లు సమాచారం. ఈ అక్రమ బియ్యం వ్యాపారం వెనుక బడా నాయకుల హస్తం ఉన్నట్లు తెలిసింది. జిల్లా అధికారులు స్పందించి సబ్సిడీ బియ్యం అక్రమ రవాణాన్ని అడ్డుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా.. పేదల తిండికి ఉపయోగపడేలా చూడాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం : తహశీల్దార్ ప్రసాద్ రాజా

సెల్‌ఫోన్ ద్వారా తహశీల్దార్‌ను ప్రజాశక్తి సంప్రదించింది. నేను విజయవాడలో శిక్షణలో ఉన్నాను. గవి సిద్ధేశ్వర రైస్ మిల్లులో సబ్సిడీ బియ్యం పాలీష్ చేయడం, నిల్వ ఉంచడంపై ఆర్‌ఐ ద్వారా విచారణ చేపడతాం. విచారణలో గుర్తిస్తే చర్యలు తీసుకుంటాం.



వే బ్రిడ్జి కాటా వేయించుకుని గవి సిద్ధేశ్వర రైస్‌మిల్లులోకి సబ్సిడీ బియ్యంతో వెళ్తున్న బొలేరో వాహనం

సొంతింటి కల సాకారం చేసిన జగన్

- కౌన్సిలర్ లక్ష్మీదేవి

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని కౌన్సిలర్ లక్ష్మీదేవి తెలిపారు. గురువారం ఆదోనిలోని 21వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి జగనన్న కాలనీలోని స్థలాలకు 236 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుక, ఆరోగ్యశ్రీ, చేయూత, ఈబీసీ, కాపు నేస్తం, వాహన మిత్ర, జగనన్న చేదోడు వంటి పథకాలు అమలు చేస్తూనే ఇంటి స్థలాలు అందజేస్తూ పేదలకు దానిపై పూర్తి హక్కులు కలిగేలా చట్టం తీసుకొచ్చారని తెలిపారు. పేదలకు అన్ని విధాలుగా అండగా ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. సచివాలయ కన్వీనర్ చిన్న గౌడ్, ఉద్యోగులు వీరన్న, రవికుమార్, ప్రమీల, ప్రవల్లిక, వాలంటీర్లు ఉన్నారు.


రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీదేవి

కుక్క కాటు నుంచి పురవాసులను కాపాడలేమా..?

- కౌన్సిల్‌లో ధ్వజమెత్తిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో కుక్కకాటు బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారని, కనీసం వాటి భారీ నుంచి కాపాడలేని పరిస్థితుల్లో ఉన్నామా అంటూ కౌన్సిలర్ రఘునాథరెడ్డి, సైరానా భాను అధికారులను నిలదీశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 5వ వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. ఎంఐజి కాలనీ, వెంకన్నపేట, పర్ష మహల్, బుడేకల్, క్రాంతి నగర్, అరుణ్ జ్యోతి నగర్ ప్రాంతాల్లో కుక్కల సంతతి రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. వెంకన్నపేటలో ఇటీవల ఓ చిన్నారిపై వీధి కుక్క దాడి జరిగిన విషయం తెలిసిందేనని చెప్పారు. వీధి కుక్కలను పట్టి అడవుల్లో వదలాలని అసిస్టెంట్ కమిషనర్ అనుపమను కోరారు. ఆదోని అటవీ శాఖ అధికారులతో కలిసి కుక్కలను పట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... కాలువల్లో పూడిక తీసేందుకు ప్రొక్లెయిన్ ఉండేదని, ప్రస్తుతం కనపడడం లేదని తెలిపారు. తాగునీటికి అంతరాయం ఏర్పడకుండా, విద్యుత్ సమస్య రాకుండా జనరేటర్ ఉందని చెబుతున్నారు తప్ప ఎప్పుడు ఉపయోగించారో ఇంతవరకు తెలియదని అనుమానం వ్యక్తం చేశారు. వేసవి ముంచుకొస్తోందని, బసాపురం ట్యాంకులో నీటి నిల్వకు ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని ప్రశ్నించారు. మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి మాట్లాడుతూ... ఎల్‌ఎల్‌సికి తాగునీటి అవసరాల కోసం నీరు వదిలారని, ట్యాంకులోకి మళ్లించి నిల్వ చేస్తామని తెలిపారు. ట్యాంకు మరమ్మతుల వల్ల సామర్థ్యం కాకుండా 75 శాతం నీటి నిల్వకు అవకాశం ఉందని నిపుణులు సూచించారని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... వాల్మీకి నగర్‌లో సామూహిక మురుగుదొడ్డికి నీటి వాడుకునేందుకు సంపు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తెచ్చారు. 4వ వార్డు కౌన్సిలర్ మహేశ్వరి మాట్లాడుతూ... అవసరాల నిమిత్తం వాటర్ ట్యాంకు నిర్మించారని, బోరు లేకపోవడం వల్ల నిరుపయోగంగా మారాయని తెలిపారు. అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... త్వరలోనే బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... వీధి లైట్లు లేక కొన్ని ప్రాంతాల్లో చీకటిమయంగా మారుతోందని తెలిపారు. కౌన్సిలర్ ఉస్మాన్ మాట్లాడుతూ... రంజాన్ నేపథ్యంలో తెల్లవారుజామునే నమాజ్‌కు వెళ్లాల్సి ఉంటుందని, వీధిలైట్లు వెలిగేలా చూడాలని కోరారు. నమాజ్‌కు అంతరాయం కలగకుండా, తాగునీరు వదిలేలా లైన్‌మెన్‌కు సూచించాలని కోరారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... లైటు ఏర్పాటు చేయాలంటే కౌన్సిలర్లే వైర్ కోసం డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోయారు. పదవి కాలం ముగుస్తున్నా కౌన్సిలర్లకు కనీస మర్యాద కూడా అధికారులు ఇవ్వడం లేదని బాలాజీ తెలిపారు. స్ట్రీట్ లైట్ల సమస్యను పరిష్కరించాలని కోరగా స్పందించిన మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి మాట్లాడుతూ... కాంట్రాక్టర్ సమయం ముగిసిందని, త్వరలోనే టెండర్ పిలుస్తామని, సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

కమేళా మార్చాలి : పట్టణంలోని బొబ్బులమ్మ గుడి సమీపంలో ఉన్న కమేలాను మార్చాలని ఆ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ కోరారు. నివాసాల మధ్య జీవాలు వధించడం వల్ల రక్తం, వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారుతోందన్నారు. నిత్యం శుభ్రం చేయకపోవడం వల్ల అపరిశుభ్రత కారణంగా రోగాల బారిన పడుతున్నామని స్థానికులు స్పందనలో అర్జీ ఇచ్చారని గుర్తు చేశారు. మైనార్టీ కాలనీ సమీపంలో కమేళా ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వైస్ ఛైర్మన్ మహ్మద్ గౌస్, కో ఆప్షన్ సభ్యులు తిమ్మక్క, కౌన్సిలర్లు రాజేశ్వర్ రెడ్డి, సందీప్ రెడ్డి, కీర్తన, ఇందు, లక్ష్మి, యాసిన్, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, అసిస్టెంట్ ఇంజినీర్ కృపాకర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, చంద్రమోహన్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ రఘునాథరెడ్డి


మాట్లాడుతున్న ఉప సర్పంచి రంగన్న

ఆలూరు సీటు సుజాతమ్మకే ఇవ్వాలి

- ఉప సర్పంచి రంగన్న

ప్రజాశక్తి-ఆలూరు

టిడిపి ఆలూరు సీటు కోట్ల సుజాతమ్మకే ఇవ్వాలని టిడిపి నాయకులు, మొలగవల్లి ఉప సర్పంచి రంగన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతూ, కార్యకర్తలకు 'నేనున్నాను' అంటూ భరోసా ఇస్తూ అండగా ఉంటున్న ఆమెను కాదని వేరొకరికి ఇస్తే పార్టీకి రాజీనామా చేస్తామని ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకులను ఉత్తేజ పరుస్తూ అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నారని చెప్పారు. అలాంటి ఆమెకే ఆలూరు టిడిపి సీటు ఇవ్వాలని కోరారు. వార్డు సభ్యులు ఐకాంత్, జలందర్, హుస్సేని పాల్గొన్నారు.

విద్యా, వైద్యానికి పెద్దపీట

- వార్డు కౌన్సిలర్ నాగరత్నమ్మ

ప్రజాశక్తి - ఆదోని

బడుగు, బలహీన వర్గాలకు అత్యవసరమైన విద్యా, వైద్యానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని 29వ వార్డు కౌన్సిలర్ నాగ రత్నమ్మ, కన్వీనర్ ముంబత్తి స్వామి తెలిపారు. గురువారం ఆదోనిలోని 29వ సచివాలయం 5 నుంచి 25 లక్షలకు పెంచిన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యత నిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, ఆదోని ఎమ్మెల్యేగా సాయి ప్రసాద్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మహ్మద్ హుస్సేన్, త్రివేణి, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. గత మాసంలో జరిగిన రోడ్ సేఫ్టీ సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాల్లో భాగంగా ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో నెట్టేకల్ క్రాస్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, ఎమ్మిగనూరు పట్టణం నందవరం జంక్షన్ దగ్గర లైటింగ్, ఎమ్మిగనూరు కమిటీ మార్కెట్ సమీపంలో స్పీడ్ బ్రేకర్స్ వేశామని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆదోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో రంబల్స్ ట్రిప్స్ వారంలోపు పూర్తి చేయాలన్నారు. ఎమ్మిగనూరు నుంచి ఎర్రకోట వరకు రోడ్డు మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఆదోని నూతన బ్రిడ్జి సమీపంలో సర్వీసు రోడ్డుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మిగనూరు, ఆస్పరి రోడ్డుకు సంబంధించి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి వివరాలపై ఆరా తీశారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి అక్కడ నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ ప్రదేశంలో ఎలాంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమస్య లేకుండా చూడాలన్నారు. రోడ్ సేఫ్టీ సంబంధించిన నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించి ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీఎస్పీ శివ నారాయణస్వామి, ఆర్‌టిఒ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, రోడ్డు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, నేషనల్ హైవే ఎఇ శ్రీహరి, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నాయకులు, కార్యకర్తలు మా కుటుంబం

- వివాహ వేడుకల్లో టిడిపి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిటిడి నాయకులు, కార్యకర్తలు తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సోదరులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, కుమారుడు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి తెలిపారు. గురువారం నియోజకవర్గంలోనే కాక ఇతర నియోజకవర్గాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని సూగూరు, చిలకలడోణ, సుంకేశ్వరి గ్రామాల్లోనూ, ఎమ్మిగనూరు మండలంలోని వెంకటాపురం, కౌతాళం మండలంలోని ఉరుకుంద, పెద్దకడబూరు మండలంలోని రాగిమాన్ దొడ్డి, మేకడోణ, చిన్నమ్రివీడు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్నారు. నూతన వధూవరుల కుటుంబ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికి శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, సీనియర్ నాయకులు బూదూరు మల్లికార్జున రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి, దివాకర్ రెడ్డి

వైభవంగా కొత్తపేట ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కొత్తపేట గ్రామంలో గురువారం శ్రీహజరత్ దివానే మస్తాన్‌వలీ ఉరుసు ఉత్సవాలు దర్గా కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉరుసు ఉత్సవాల సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలంకరణతో అలంకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తాదులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తాదులు పూజలు నిర్వహించి కానుకలు, ముడుపులు సమర్పించుకున్నారు. స్థానిక సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ విమర్శించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మిగనూరు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా శిబిరాన్ని జిల్లా ఉపాధ్యక్షులు ఖాసీంజీ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగులు పొందాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో మంజూరు చేయడం లేదని, మంజూరయిన వాటి బకాయిలు విడుదల చేయడంలో జాప్యం చేస్తోందని తెలిపారు. జిల్లా సబ్ కమిటీ సభ్యులు ఖాసీంజీ, వెంకటేశ్వర్లు, రంగనాథ్ మాట్లాడారు. తక్షణమే ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పెన్షనర్ అసోసియేషన్ బాధ్యులు పోలుకంటయ్య మద్దతు తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులు కృష్ణయ్య శెట్టి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పరశురాముడు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు హేమంత్ కుమార్, సీనియర్ కార్యకర్తలు రామన్న, బిఎస్.రామాంజనేయులు, వీరభద్ర ఆచారి, సుగుణ కుమార్, చాంద్‌బాషా, హరికృష్ణ ప్రసాద్, లక్ష్మీనారాయణ, ఉరుకుందు, ప్రవీణ్ కుమార్, బసవరాజ, శ్రీనివాసులు, శివకుమార్, అంపయ్య, ప్రతాప్ సిన్హా, హుస్సేన్, భీమేష్, మైలే మల్లికార్జున, ముక్కరన్న, సత్యనారాయణ, కృష్ణయ్య పాల్గొన్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

8 గడ్డివాములు దగ్ధం

- రూ.3 లక్షలు ఆస్తి నష్టం

- సకాలంలో స్పందించిన ఆలూరు అగ్నిమాపక అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని నెరణికి గ్రామంలో 8 గడ్డివాముల దగ్ధమైన సంఘటనలో రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. నెరణికి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నడిమింటి చంద్రప్ప, నడిమింటి ఈరన్న, ఆదోని ఈరన్న, షేకన్న, ఈశ్వరమ్మ, సాధన్న, పి.షేకన్న, పేట మల్లేష్‌కు చెందిన వరి గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గడ్డివాముల నుంచి దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేశారు. మంటలు ఎక్కువ అవుతుండడంతో ఆలూరు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. మిగతా గడ్డివాములకు నిప్పంటుకోక పోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పిందని పలువురు పేర్కొన్నారు. గడ్డివాముల విలువ సుమారు రూ.3 లక్షలకు పైగా ఉంటుందని బాధితులు వాపోయారు.

చేతి రాత బంగారు భవిష్యత్తుకు బాట

- అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కలం ప్రహ్లాద్

ప్రజాశక్తి - ఆదోని

మంచి చేతి రాత కూడా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కలం ప్రహ్లాద్ తెలిపారు. గురువారం ఆదోనిలోని నెహ్రూ మెమోరియల్ స్కూలులో విద్యార్థులకు సుందర దస్తూరి పోటీలు, పద్య రచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వైష్ణవి, మహేశ్వరి, ఉదయ్ కుమార్, వంశిత, అర్చన షేక్షావలీ, ఈశ్వరి, హిమబిందు నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు అలీమ్ సిద్ధిఖీ చేతుల మీదుగా ప్రోత్సాహకాలు అందజేశారు. సువర్ణ, కోటన్న, లోక్యా నాయక్, ప్రసాద్ పాల్గొన్నారు.


విద్యార్థులతో ఉన్న ప్రధానోపాధ్యాయులు

శుక్రవారం 01 మార్చి 2024 5 నంద్యాల





ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

నిమిషం ఆలస్యమైనా.. అనుమతి లేదు

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు - పూర్తయిన ఏర్పాట్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరించనున్నారు. పరీక్షలకు సంబంధించి అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు..

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి 20 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75,814 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం 121 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించకూడదని ఇంటర్ బోర్డు నుంచి ఇప్పటికే ఆదేశాలందాయి. హాల్‌టికెట్లను ఇప్పటికే ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్‌లో ఉంచారు. కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా మంచి నీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. అవకతవకలు, మాస్ కాపీయింగ్స్ పాల్పడ కుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు, కర్నూలు నగరంలోని ఇంటర్ ప్రాంతీయ కార్యాలయానికి అనుసంధానం చేశారు. కర్నూలు జిల్లాలో మొత్తం 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల విద్యార్థులు మొత్తం 47,412 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్ష ప్రశ్నపత్రాలు నిల్వ చేసేందుకు 23 పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశారు. డిపార్టుమెంట్ ఆఫీసర్లు 69 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు 69 మంది, కస్టోడియన్లు ఐదుగురు, ఫ్లయింగ్ స్క్వాడ్లు ముగ్గురు, సిట్టింగ్ స్క్వాడ్ ఆరుగురు, ఒక హైపవర్ కమిటీ, డీఈసీ కమిటీలు 4, డీవీఈఓలు 2 ఇద్దరు, ఇన్విజిలేటర్లను సుమారు 1,000 మందిని నియమించారు. నంద్యాల జిల్లాలో 52 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 28,402 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కర్నూలు జిల్లాలో 5, నంద్యాలలో 4 సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించారు. ఆలూరు, పత్తికొండ, దేవనకొండ, కోసిగి, చిప్పగిరి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు.

సర్వం సిద్ధం : డివిఇఒ



నంద్యాల కలెక్టరేట్ : నేటి నుండి ఈ నెల 20 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని డివిఇఒ సునీత తెలిపారు. గురువారం డివిఇఒ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 28,402 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం 13,553 మంది, ద్వితీయ సంవత్సరం 14,849 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అందుకు 55 పరీక్షా కేంద్రాలు, చీఫ్ సూపరింటెండెంట్లు 52 మంది, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్స్ 52 మందిని పరీక్షల నిర్వహణకు కేటాయించినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్లు, సిసి కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు, తాగునీరుతో పాటు అన్ని సదుపాయాలు కల్పించినట్లు ఆమె చెప్పారు. ఇప్పటికే ప్రశ్న పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరాయని, 22 కాన్ఫిడెన్షియల్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందుగా చేరుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులు ఎలాంటి భయందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు.

21 నుండి మూల్యాంకనం

నంద్యాల జిల్లా కేంద్రంలోనే మొదటి సారిగా ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి క్యాంపు ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21న నంద్యాలలోనే మూల్యాంకనం జరుగుతుందన్నారు.

4న బనగానపల్లెకు ముఖ్యమంత్రి రాక

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె : ఈ నెల 4వ తేదీన బనగానపల్లెలో ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన ఖరారు అయినట్లు జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిలు తెలిపారు. గురువారం పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పర్యవేక్షించారు. బనగానపల్లె పట్టణంలో రూ.22 కోట్లతో నూతనంగా నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటనపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

- జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో నేటి నుండి 11వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవస్థానం, జిల్లా అధికారులకు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. గురువారం శ్రీశైలంలోని కమాండ్ కంట్రోల్ రూములో శివరాత్రి ఉత్సవాలపై, భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై నోడల్ అధికారులో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర అజాద్, శ్రీశైల దర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డి వారి చక్రపాణిరెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలం క్షేత్రానికి దాదాపు 6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు అమలు చేయడంతో పాటు అవసరమైన జనరేటర్లను సమకూర్చాలని తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి భక్తుల క్యూ లైన్‌లు, టోల్‌గేట్, వలయ రహదారి (రింగురోడ్డు) యజ్ఞవాటిక, పార్కింగు ప్రదేశాలు, మల్లమ్మ కన్నీరు ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆత్మకూరు ఆర్‌డిఒ మిరియాల దాసు, అన్ని శాఖల జిల్లా అధికారులు, మార్కాపురం, దోర్నాల, తెలంగాణా, కర్ణాటక ప్రాంతాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సరైన పరిహారం వచ్చే వరకూ

పోరాడుతాం

- సోలార్, కల్వకుర్తి 167 హైవే రోడ్డుకు భూములు కోల్పోతున్న బాధితులు
- 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలి
- నష్టపరిహారం ఇచ్చేవరకు భూములు ఇవ్వం...
- రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ప్రభాకర్ రెడ్డి చిత్రంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి. రమేష్ కుమార్, ఏ. రాజశేఖర్ తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సోలార్, కల్వకుర్తి 167 హైవే రోడ్డుకు ప్రాజెక్టులకు భూములు కోల్పోతున్న బాధితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని, సరైన నష్ట పరిహారం చెల్లించే వరకు తమ భూములు సోలార్, హైవేలకు ఇచ్చేది లేదని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి. రమేష్ కుమార్, ఏ. రాజశేఖర్‌లు పేర్కొన్నారు. గురువారం పాణ్యం మండలం ఆలమూరు కందికాయ పల్లె కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167 హైవే రోడ్‌లో భూములు కోల్పోతున్న రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే .ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలు రైతుల భూములను కారు చౌకగా తీసుకుంటున్నారన్నారు. సరైన నష్టపరిహారం చెల్లించకుండా భూములు స్వాధీనం చేసుకుంటూ రైతులను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండే ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ప్రజలకు సహకరించేది పోయి కంపెనీ యజమానులకు కొమ్ము కాస్తున్నారని,కంపెనీల నుంచి నాయకులకు అధికారులకు ముడుపులు ఏమైనా ముడుతున్నాయేమోనని భావించాల్సి వస్తుందన్నారు. రైతులకు రావలసిన నష్టపరిహారం ఇప్పించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం మార్కెట్ రేటు పైన నాలుగు రేట్లు అదనంగా నష్టపరిహారం ఇవ్వాలని పట్టా భూములతో పాటు డిపట్టా అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు కూడా సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని, రైతులు వ్యవసాయ కూలీలు చేతివృత్తుల వారికి పునం ావసం కల్పించాలని చట్టంలో ఉన్న వాటిని విస్మరించి రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. 2013 భూ సేకరణ చట్టం అమలు చేసే వరకు ఈ ఉద్యమం ఆగదన్నారు. ప్రభుత్వము న్యాయంచసేవరకూ ఐక్యంగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు. అధికారులు రైతులతో చర్చించి పరిష్కారం చేయని పక్షంలో రైతులు, వ్యవసాయ కార్మికులు మహిళలను సమీకరించి కలెక్టర్ ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమాలు చేపడతామని, బాధితులకు న్యాయం చేయకపోతే సోలార్ పనులను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పరిపాలన అధికారికి రైతుల వ్యక్తిగత అర్జీలు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు, కందిగాయపల్లె, పిన్నాపురం, కొత్తపల్లి మండలం సింగరాజు పల్లె ,బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె, ఏ కోడూరు, బండి ఆత్మకూ రు, నంద్యాల మండలం బిల్లాలాపురం, చింతకుంట నుంచి రైతులు మహిళలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు. వి. సుబ్బరాయుడు జిల్లా సహాయ కార్యదర్శులు టి. వెంకటేశ్వరరావు, ఏ సురేష్, జిల్లా నాయకులు ప్రసాద్ సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , సిఐటియు నాయకులు కే. భాస్కర్ ,రత్తమయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్స్‌కు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలి

మున్సిపల్ కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్‌కు స్కిల్డ్ సెమిస్కిల్డ్ వేతనాలు వర్తింపచేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్,కే మహమ్మద్ గౌస్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కరాచారిలు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. గురువారం నాయకులు కమిషనర్ నిరంజన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో దాదాపుగా 20 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు ఇంజనీరింగ్ విభాగంలో ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ లాంటి విభాగాలలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు జీవో నెంబర్ ఏడు ప్రకారం గుర్తింపచేయాలన్నారు. నంద్యాల పట్టణంలో అన్ని రకాలుగా అర్హతలు జీవో నెంబర్ ఏడు ప్రకారం కలిగిన 22 మంది కార్మికులు ఉన్నారని, గతంలో అన్ని రకాల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసి ఆప్కాస్‌కి వీళ్ళ వివరాలను పంపించే సందర్భంలో కమిషనర్ బదిలీ కావడంతో ఆ ఫైల్ పెండింగ్లో ఉందన్నారు. కావునా వెంటనే మళ్ళీ అర్హులైన 22 మంది వర్కర్స్‌కు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇచ్చే లాగున రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కరాచారి, రామకృష్ణ, పవన్, కరిముల్లా నాయకులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు



జీతాలు మంజూరు చేయించాలని పాఠశాల సెక్యూరిటీ గార్డ్స్ సిద్ధార్థ రెడ్డికి విన్నవిస్తున్న దృశ్యం

జీతాలు మంజూరు చేయించి ఆదుకోండి

- బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి పాఠశాల సెక్యూరిటీ గార్డ్స్ విన్నపం

ప్రజాశక్తి - పగిడ్యాల

గత ఎనిమిది నెలల పని చేస్తున్న తమకు జీతాలు రావడం లేదని, జీతాలు మంజూరు చేయించి ఆదుకోవాలని గురుకుల పాఠశాల సెక్యూరిటీ గార్డ్స్ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డిలకు గురువారం విన్నవించారు. జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కుటుంబ పోషణ భారమైందని, జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సేవ సుప్రీం సంస్థతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తానని బైరెడ్డి సిద్ధార్ధ రెడ్డి వారికి హామీనిచ్చారు.

నేటి నుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు


ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో నేటి నుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నేడు ముందుగా యాగశాల ప్రవేశం చేసి చండీశ్వర పూజ, కంకణ ధారణ, కంకణ పూజ, వాస్తు పూజ, వాస్తు హెూమం, సాయంత్రం అంకురార్పణ, ధ్వజ పటాకావిష్కరణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరగనున్నాయి.

బంగారు హారం బహూకరణ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ దేవికి గురువారం చిలకలూరిపేటకు చెందిన రమేష్ బాబు, కోటేశ్వరమ్మ దంపతులు బంగారు హారాన్ని బహుకరించారు. బంగారు హారంలో రాళ్లు పొదగబడి 75 గ్రాములు బరువు కలిగి ఉంది. హారంతోపాటు రాళ్లతో పొదగబడిన బంగారు కమ్మలు 8 గ్రాములు కలిగి ఉన్నాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేద ఆశీర్వచన మండపంలో అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు ఉమా నాగేశ్వర శాస్త్రి, ఆలయ ఇన్స్పెక్టర్ మల్లికార్జునలకు సాంప్రదాయ బద్ధంగా దాతలు బంగారు హారము, కమ్మలు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలు, ప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.



పది మంది గొప్పగా చెప్పకునేలా బతకాలి

- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

ప్రజాశక్తి - పగిడ్యాల

పదిమంది గొప్పగా చెప్పుకునేలా బతకాలని, లేదా సంతోషంగా అయినా బతకాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. గురుకుల పాఠశాల సంపు ట్యాంకులోకి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పూజ చేసి నీటిని విడుదల చేశారు. అంతకుముందు ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గురుకుల పాఠశాల వద్దకు రాగానే విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికారు. అనంతరం బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడారు. ఆదం సంస్థ ప్రోత్సాహంతో నిర్మల్ ఆర్గనైజేషన్ సహకారంతో గురుకుల పాఠశాలకు నీటి సమస్య పరిష్కరించడం అభినందనీయమన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా ఆదా చేసేలా చూడాలని విద్యార్థినిలకు సూచించారు. ప్రిన్సిపల్ వెంకటరమణ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో నీటి సమస్య పరిష్కారం కోసం ఎంతో కష్టపడ్డామన్నారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి వాట్సాప్ ద్వారా చిన్న మెసేజ్ పెట్టడంతో వెంటనే పరిష్కరించారని తెలిపారు. ఎప్పుడైనా నీటి సమస్య వస్తే మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి ట్యాంకర్లతో నీటిని పంపించేవారని చెప్పారు. కార్యక్రమంలో ఆదం నిర్మల్ ఆర్గనైజర్ సంస్థ జిఎం సత్య కుమార్ లింగారెడ్డి, జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపిపి మండ్ల మల్లేశ్వరి, సర్పంచులు సుజాత, శేషన్న, వైసిపి నందికొట్కూర్ ఇన్చార్జి డాక్టర్ సుధీర్, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఉస్మాన్ భాష, ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సంపులోకి నీటిని విడుదల చేస్తున్న ఎంపీ బ్రహ్మనంద రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

గెలుపే ధ్యేయంగా పని చేయాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని, టిడిపి, జనసేన కార్యకర్తలు ఈ 45 రోజులు మరింత శ్రమించాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని ఎంఎం గార్డెన్స్‌లో జరిగిన శ్రీశైలం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో తన సోదరుడు బుడ్డా సీతారామరెడ్డి టిడిపి ఎమ్మెల్యేగా గెలుపొందారని, నాటి నుండి నేటి వరకు ప్రజలలో బలం ఉన్నప్పటికీ టిడిపి గెలవలేదన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీశైలం నియోజవర్గంలో టిడిపి జెండాను ఎగురవేసి పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే దిశగా కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఈ నెలలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు శ్రీశైల నియోజవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు చేసిన సందర్భంలో శ్రీశైలం నియోజకవర్గంలో ముగ్గురు టిడిపి కార్యకర్తలు మనస్థాపంతో మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందేనని, ఆ కుటుంబాలకు పార్టీ నాయకత్వం మూడు లక్షల రూపాయలు చొప్పున నగదును వారి అకౌంట్లో వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కంచర్ల సురేష్ రెడ్డి, బన్నూరు రామలింగారెడ్డి, ప్రముఖ న్యాయవాది గోవిందరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు జట్టి వేణుగోపాల్, శివ ప్రసాద్ రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



టిడిపి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

వైసిపి నేతల మధ్య ఘర్షణ వాతావరణం

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామంలో అధికార పార్టీ వైసిపిలో ఇరు గ్రూపుల మధ్య గురువారం ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. వివరాలు.. లక్ష్మాపురం గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆంజనేయస్వామి విగ్ర ధ్వజ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిలు హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే ఆర్థర్‌ల అనుచరులు నినాదాలు చేయడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఇరుగ్రూపుల మధ్య తోపులాట జరుగుతుండగా పోలీసులు జోక్యం చేసుకొని వారిని నివారించే ప్రయత్నం చేశారు. తోపులాటలో పోలీస్ సిబ్బంది కింద పడిపోయారు. వెంటనే పోలీసులు ఇరుగ్రూపుల వారిని అక్కడి నుంచి పంపించి ఎటువంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించారు.

నేడు బహిరంగ వేలం పాటలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పురపాలక సంఘం 2024-25గాను వారపు సంత, దిన కూరగాయల మార్కట్, బస్టాండ్ ఫీజులు, జంతు వధశాల, మాంసపు మార్కెట్‌కు సంబంధించిన వేలం పాటలు శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం జై కిసాన్ పార్క్‌లో నిర్వహిస్తున్నట్లు ఆర్వో విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు వాల్యుయేషన్ సర్టిఫికెట్‌తో పాటు ధరావత్తును కమిషనర్ నందికొట్కూరు మున్సిపాలిటీ పేరుపై డిడి రూపంలో చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

కార్యకర్తకు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని ఏబిఎం పాలెంలో బుధవారం రాత్రి విలేకరి కాటెపోగు స్వామన్న తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్న దేవదాస్‌ను రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డిలు వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి దేవదాసు ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా అవసరమయితే సమస్య తమ దృష్టికి తీసుకురావాలని, అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. వీరితో పాటు వైసిపి నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు బొల్లెద్దుల రామక్రిష్ణ, కౌన్సిలర్ చిన్న రాజు, అబ్దుల్ రవూఫ్, లాలు ప్రసాద్, నాయకులు రజిని కుమార్, పి రమేష్, పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు మున్సిపాలిటీ నియమ నిబంధనల ప్రకారం పెట్టుకోవాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. గురువారం కూరగాయల మార్కెట్‌ను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సందర్శించి వ్యాపారులు మున్సిపల్ నియమనిబంధనల ప్రకారం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్‌లో కూరగాయల మార్కెట్ లోపల కూరగాయల వ్యాపారం చేసుకునే వారికి మున్సిపాలిటీ నియమ నిబంధన ప్రకారం స్టాల్స్ కేటాయించడం జరిగిందని,అయితే కొంతమంది అనామకంగా మున్సిపాలిటీ నియమ నిబంధనలు పాటించకుండా చిరు వ్యాపారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని అలాంటి వారిపై మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఉండాలని, మున్సిపాలిటీ వారికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఉండేలా వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలని కోరారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

వైసిపి ప్రభుత్వంలోనే పేదల అభివృద్ధి

- మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి పాములపాడు

వైసిపి ప్రభుత్వంలోనే పేదల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం పాములపాడులో పేదలకు ఇంటి రిజిస్ట్రేషన్ల పత్రాల పంపిణీ కార్యక్రమం తాసిల్దార్ పటాన్ బాబు, ఎంపీడీవో సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసిపి నాయకులు, అధికారులు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి దగ్గరకే వచ్చి పథకాలు అందిస్తూ, సిఎం జగన్ మోహన్ రెడ్డి దేశంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి దశలో నడిపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి మేకల భాగ్యమ్మ, వైసిపి మండల నాయకులు విజయసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రావు, సొసైటీ చైర్మన్ చౌడయ్య, కో ఆప్షన్ మెంబర్ ముర్తుజా అలీ, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాదరావు, నాయకులు రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న రామలింగేశ్వర రెడ్డి

అవుకులో
రూ. 10 , 20 నోట్ల కొరత


రూ.10 నోటు, రూ.20 నోట్లు

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలో రూ. 10, 20 రూపాయల నోట్ల కొరత తీవ్రంగా ఉంది. అటు ప్రజలు, ఇటు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ వస్తువు కొనాలన్నా చిల్లర నోట్లు జేబులో ఉంటేనే కొనాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులకు ఏ వస్తువు అమ్మాలన్నా రూ. 10, రూ. 20ల నోట్ల కొరత కారణంగా వ్యాపారాలను వదులుకోవాల్సి వస్తోందని వ్యాపారస్తులు చెబుతున్నారు. బుధవారం అవుకు పట్టణంలో వారపు సంత జరిగింది. రూ. 10, రూ.20 నోట్ల కొరత తీవ్రంగా ఉండటంతో సంతలో వ్యాపారాలు చేయలేకపోతున్నామని వ్యాపారస్తులు ఒకవైపు ఆవేదన చెందుతుంటే మరోవైపు వినియోగదారులు చిల్లర నోట్లు లేకపోవడంతో ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంది. బ్యాంకులలో కూడా పది రూపాయల నోట్లు ఇవ్వకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒకవేళ ఇచ్చినా పాత, చిరిగిన నోట్లనే కట్టల రూపంలో అతి కొంత మందికే వినియోదారులకు అందిస్తుండడంతో నోట్ల కొరత విపరీతంగా మారింది. ఆన్‌లైన్ వ్యాపారాలు విపరీతంగా పెరిగిపోవడం, ఫోన్ పే, గూగుల్ పేల ద్వారా చాలామంది లావాదేవీలు చేస్తున్నడంతో నోట్ల కొరత తీవ్ర సమస్యగా మారిందని కొంతమంది పేర్కొంటున్నారు. ఏదేమైనా రూ.10, 20 రూపాయల నోట్లను బ్యాంకులలో లభ్యమయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ ఆసియా

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కౌన్సిలర్లు అందరూ కృషి చేయాలని మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా అన్నారు. గురువారం అన్న క్యాంటీన్‌లో మున్సిపాలిటీ కౌన్సిలర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తొమ్మిది అంశాలపై సభ్యులు చర్చించారు. ప్రధానంగా ఆత్మకూరు పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలపై సభ్యులు చర్చించి ఆమోదించారు. 2024-25కు దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్, బస్టాండ్ ఫీజులు, చిన్న, పెద్ద కమేలాలు, చికెన్, చేపల అమ్మకాలకు సంబంధించి వాటిపై టెండర్‌లో పాల్గొన్న వారికి ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ హరిప్రసాద్, వైస్ చైర్మన్ రాజగోపాల్. కౌన్సిల్ ప్రకాష్ రావు . పాణ్యం పార్వతి. బోయ పార్వతి. బోయ లక్ష్మమ్మ.రంగస్వామి .గౌస్ లాజం. కోషన్స్ సభ్యుడు ఎంఏ రషీద్. తదితరులు పాల్గొన్నారు.

బాల అకాడమీలో
సాంఘిక సేవా కార్యక్రమాలు


అనాథ పిల్లలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని బాల అకాడమీ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవీంద్రనాథ్ , ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ 'మానవసేవయే- మాధవ సేవ' కార్యక్రమంలో భాగంగా పాఠశాల చిన్నారులందరూ కలిసి తమ వంతుగా పండ్లులను, వస్త్రాలను, ఆర్థికంగా కొంత డబ్బులను పోగుచేసుకొని అనాథులయిన పిల్లలకు, వృద్ధులకు, వికలాంగులకు పంపిణీ చేయడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత, పాఠశాల చిన్నారులు మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందుకు సహకరించిన తల్లితండ్రులకు యాజమాన్యం వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

భేటీ బచావో - భేటీ పడావో పట్ల అవగాహన

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని సిడిపిఒ ఆధ్వర్యంలో జడ్.పి.హెచ్ పాఠశాల విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. గురువారం నంద్యాల మండలం, కొత్తపల్లి గ్రామంలో జడ్పీహెచ్ పాఠశాల నందు భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ విజయ మాట్లాడుతూ ఆడ పిల్లల రక్షణ కోసం భేటీ బచావో- భేటీ పడావో పథకం కేంద్ర ప్రభుత్వం తీసుకొని రావడం జరిగిందన్నారు. ప్రతి ఆడపిల్ల మంచి చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే 1098, 100కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్వైజర్ విజయ,స్కూల్ హెడ్ మాస్టర్, అంగన్వాడీ టీచర్ ఈశ్వరమ్మ, 150 మంది బాలికలు హాజరయ్యారు.


కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్

ఉపాధి కూలీలకు అన్ని వసతులూ కల్పించాలి

- అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్

ప్రజాశక్తి - పగిడ్యాల

వేసవిని దృష్టిలో ఉంచుకొని కూలీలకు అన్ని వసతులు కల్పించాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ ఉపాధి సిబ్బందికి సూచించారు. పగిడ్యాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆయన ఉపాధి కూలీలను అడిగారు. గత ఐదు వారాల నుంచి మాకు వేతనాలు రాలేదని కూలీలు తెలిపారు. రోజు ఇచ్చే వేతనాన్ని పెంచాలని కూలీలు కోరారు. సమస్యలను జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే సరైన వేతనం వస్తుందన్నారు. పగిడ్యాల గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు ఐదు సంవత్సరాల క్రితం నిర్మించుకునమ్న గోకులం షెడ్డుకు బిల్లు రాలేదని సురేంద్ర కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నత అధికార దృష్టికి తీసుకెళ్లి బిల్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీవో మద్దిలేటి, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన చికెన్ ధర

- రెండు వారాల్లోనే పెరిగిన వంద రూపాయలు


అమ్మకానికి ఉంచిన చికెన్

ప్రజాశక్తి - బనగానపల్లె

చికెన్ ధరలు కొండెక్కాయి. రెండు వారాల్లోనే కిలోపై 100 రూపాయలు పెరిగింది. గురువారం బనగానపల్లెలో చికెన్ ధర కిలో రూ.240, స్కిన్‌లెస్ 260 చొప్పున విక్రయించారు. బోన్‌లెస్ చికెన్ కిలో రూ. 490లకు విక్రయించారు. ధర పెరగడతో చికెన్ ప్రియులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం వరకు చికెన్ ధరలు తక్కువగా ఉండేవి. కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతుఆన్నరు. ఎండలు పెరగడంతో కోళ్లు చనిపోవడం, కొన్ని జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్లు చనిపోయి ధరలు పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఎండలు ముదిరే కొద్ది చికెన్ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. గత నెలలో చికెన్ కేజీ రూ. 140 ధర ఉండేది. రెండు వారాల్లో రూ. 240లకు పెరిగింది. లైవ్ కోడి కేజీ 180 రూపాయలకు అమ్ముతున్నారని, దీంతో తాము చికెన్ ధరలు పెంచినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలలో చికెన్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. మటన్ ధర కిలో రూ. 800 నుండి రూ. 900 వరకు అమ్ముతున్నారు. దీంతో సామాన్యులు, పేదలు చికెన్, మటన్ కొనలేని పరిస్థితి నెలకొంది.


చికెన్ కొడుతున్న షాప్ యజమాని

కోళ్ల ధరలు పెంచారు
- ముక్తియార్ మహబూబ్ చికెన్ సెంటర్ యజమాని



వ్యాపారులు కోళ్ల ధరలను పెంచడంతో తాము చికెన్ ధరలను పెంచవలసి వచ్చింది. కోళ్లను బెల్గాం నుండి కొనుగోలు చేస్తాం. కోడి లైవ్ ధర రూ. 180లకు అమ్ముతున్నారు. దీంతో మేము చికెన్ రూ. 240లకు అమ్మాల్సి వస్తోంది. కోళ్ల ఉత్పత్తి కూడా తగ్గడంతో చికెన్ ధరలు పెరిగేందుకు ఓ కారణం. ఎండలు ముదిరే కొద్దీ కోళ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

అన్యాక్రాంతంపై ..
కౌన్సిల్‌లో కొట్లాట..

- 2 ఎకరాల 50 సెంట్ల మునిసిపల్ స్థలంపై ప్రతిపక్ష నేతలు నిలదీత
- లంచం తిన్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం : చైర్‌పర్సన్ మాబున్నిసా
- పలు అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్


కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో మున్సిపల్ స్థలం అన్యాక్రాంతం జరిగిందని మున్సిపల్ కౌన్సిల్‌లో అధికార, విపక్ష కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాడివేడి చర్చ సాగింది. గురువారం చైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో అజెండాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు, పలు అంశాలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అనంతరం నంద్యాల ఎస్‌బిఐ కాలనీ లోని 2.61 ఎకరాలు మున్సిపల్ స్థలం అక్రమణపైన కౌన్సిల్‌లో దుమారం లేచింది. 'నంద్యాల పట్టణంలో సర్వే నెం 2313/1లో విస్తీర్ణం 14.42 సెంట్లు మునిసిపాలిటీ కలిగి ఉందని, నంద్యాల మున్సిపల్ భూమి దాదాపుగా రూ.50 కోట్లు విలువగల భూమి దానిలో 2.40 సెంట్ల స్థలాన్ని 43 ప్లాట్లుగా విభజించి ప్రభుత్వ భూమిని బినామిలతో 8 మందికి రిజిస్టర్ చేసినారని దీని వెనక మున్సిపల్ అధికారులు, సబ్ రిజిస్ట్రార్ల పాత్ర ఉందని మున్సిపల్ కౌన్సిల్లో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికారులపై ధ్వజమెత్తారు. చర్చ జరుగుతుండగానే మాజీ చెర్మన్, కౌన్సిలర్ దేశం సులోచన మధ్యలోనే నిష్క్రమించారు. తనపైన వచ్చిన ఆరోపణలు ను తిప్పి కొట్టె ప్రయత్నన్ని మున్సిపల్ చైర్మన్ మాబునిసా చేశారు. ఈ సందర్బంగా ఆమె కౌన్సిల్‌లో మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలకు ఆమె వివరణ ఇచ్చారు. తాను మునిసిపల్ నిధులలో ఎటువంటి గోల్మాల్ చేయలేదని, తన నిజాయితీని శంకించాల్సిన అవసరం లేదన్నారు. తాను అవినీతికి పాల్పడి ఉంటే ఎంతదాకా అయినా సిద్ధంగా ఉన్నానని కౌన్సిల్ సాక్షిగా తెలిపారు. ఈ సందర్బంగా టిడిపి ఫ్లోర్ లీడర్ మాబువలి మాట్లాడుతూ భూమి ని ఇతరులు ఆక్రమించినట్లు, రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తన వద్ద అన్ని ఆధారాలున్నాయని, 2022వ సంవత్సరంలో ఒక వ్యక్తి హైకోర్టు ఆర్డర్ తెచ్చుకొని, జిపి చేసుకుంటుంటే మున్సిపల్ అధికారులు నిద్రపోతున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు కోర్టుకు ఎందుకు నివేదించి అక్రమ రిజిస్టర్‌లను ఆపలేకపోయారని ప్రశ్నించారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ శ్యాంసుందర్లాల్ మాట్లాడుతూ అసలు హైకోర్టు ఆర్డర్ ఏముంది? మున్సిపల్ అధికారులు హైకోర్టుకు ఎటువంటి నివేదికలు సమర్పించారో బహిర్గతం చేయాలని ప్రశ్నించారు. 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్,వైస్ చైర్మన్ పాంషావలి, టిడిపి ఫ్లోర్ లీడర్ మహబూబ్ వలి అధికారులను నిలదీస్తు చైర్ పర్సన్ మాబున్నిసాకు వివరించారు. దీనిపై చైర్ పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ మామీద బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, నేను ఎలాంటి అవినీతి చేయలేదన్నారు. ఎవరైన చేసీ ఉంటే వారీపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమృత్ పథకం ద్వారా నంద్యాల పట్టణంలో నీటి సమస్య రాకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్లు, కొ ఆప్షన్ సభ్యులు, అధికారులు ఎంఈఈ రమణమూర్తి, డీఈలు జయ భారత్ రెడ్డి, మధుకుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఓ వెంకట కృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి, రెజ్వాన, శానిటేషన్ సూపరైజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అజరత్ ఆపాంశావళి దర్గా వద్ద పూజలు చేస్తున్న గూడాల సోదరులు

ఘనంగా ఉరుసు ప్రారంభం

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని కునుకుంట్ల, ఉప్పలపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న హాజరత్ శేక్షావలి దర్గాలో గురువారం ఉరుసు మహోత్సవం కార్యక్రమం ప్రారంభమైంది. దర్గా వద్ద పూజలు చేసేందుకు భక్తులు అనంతపురం, కర్నూలు కడప నంద్యాల జిల్లాల నుండి అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్గా వద్ద భక్తులతో కిటకిటలాడుతోంది. కునుకుంట్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి ప్రతాపరెడ్డిలు దర్గా వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. దర్గా మత పెద్దలు గూడాల సోదరులకు ఆహ్వానం పలికి స్వామి వారి ఆశీస్సులను అందించారు. అనంతరం స్వామివారికి గంధం మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.మూడు రోజులపాటు జరిగే ఈ దర్గా ఉత్సవాలను నిర్వహించేందుకు మత పెద్దలు అన్ని ఏర్పాట్లను చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో కునుకుంట్ల గ్రామ వైస్ ప్రెసిడెంట్ రాము, గజ్జి వెంకటేశ్వర్ రెడ్డి మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇంటి స్థలాలు పేదలకు వరం : సర్పంచి

ప్రజాశక్తి - కొత్తపల్లి


పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గ్రామాల్లో ఉన్న ఇంటి స్థలం లేని పేదలకు జగనన్న ఇంటి స్థలాలు ఇవ్వడం వరం లాంటిదని సర్పంచ్ జమీలాబీ, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా తెలిపారు. గురువారం మండలంలోని ముసలిమడుగు గ్రామంలో సర్పంచి ఆధ్వర్యంలో జగనన్న ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇంటి పట్టాలను ఉచితంగా మహిళల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బంగి నాగన్న, వీఆర్వో రామసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి షాహిన్ షా తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె



వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా తెలుగుదేశం, జనసేన పార్టీలో తాడేపల్లి గూడెంలో నిర్వహించిన సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు, ప్రజలకు ఎంతో కీలకం అన్నారు. ప్రజల కోసం ప్రజలు పెట్టుకున్న కూటమి టిడిపి, జనసేన కూటమి అని తెలిపారు. ప్రజల ప్రయోజనాల కోసం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారని, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే బ్లూప్రింట్ టీడీపీ దగ్గర ఉందని తెలిపారు. టీడీపీ, జనసేన పొత్తు సూపర్ హిట్ అని తెలిపారు.

టిడిపి సభను విజయవంతం చేయండి : కోట్ల


సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలో శుక్రవారం నిర్వహించే టిడిపి ఆత్మీయ సభను విజయ వంతం చేయాలని టిడిపి యువ నేత కోట్ల రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలో పార్టీ నాయకులతో ఏర్పాట్లపై కోట్ల రాఘవేంద్ర రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మా నాన్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డిని డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థిగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని, నియోజకవర్గ ప్రజలతో కోట్ల కుటుంబానికి ఎంతో అనుబంధం' ఉందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అందరం కలిసికట్టుగా పనిచేసి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డిని గెలిపించుకుందామని కోరారు. శుక్రవారం డోన్ లో జరిగే బహిరంగ సభకు జిల్లాలోని టిడిపి ముఖ్య నాయకులు అంతా హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని టిడిపి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావుయాదవ్,వలసల రామకృష్ణ, ఓబులాపురం ఓబులాపురం శేషిరెడ్డి,ఎస్ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఒపిఎస్‌ను ప్రచారం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-డోన్


ఓట్ ఫర్ ఓపిఎస్ పుస్తకంను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఓట్ ఫర్ ఒపిఎస్‌ను ప్రచారం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి బివై సుబ్బారాయుడులు పిలుపునిచ్చారు. గురువారం డోన్ మండల యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో డోన్ మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఓట్ ఫర్ ఒపిఎస్ పుస్తకంను ఆవిష్కరించినట్లు యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి బివై సుబ్బారాయుడు,మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉద్యోగులకు సిపిఎస్ విధానం వల్ల పదవీ విరమణ తర్వాత ఎంతో నష్టం కలుగుతుందన్నారు. ఎవరు ఓపిఎస్ అమలు చేస్తారో వారికే మన ఓటు అంటూ నినదించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలను కలిసి,వారి మానిఫెస్టోలో ఓపిఎస్ పునరుద్ధరణ అంశాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామ నరసప్ప,రాం భూపాల్ రెడ్డి,సుదర్శన్, వెంకటేశ్వర్లు,జగన్నాథ్ రెడ్డి,లక్ష్మీ నాయక్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి,రాణి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో జరిగబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాల్సిందిగా ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.గురువారం ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి,వేద పండితులు రవిశంకర అవధాని మహానందీశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలకు రావాలని, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, నంద్యాల డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి, నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్ రెడ్డి,నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి,కళ్యాణం ఉభయదాతలు లక్కనబోయిన వెంకట ప్రసాద్, తెప్పోత్సవ ఉభయదాతలు అవ్వారు గౌరినాథ్, ధాన్య దాతలు ఎన్ హెచ్ శంకర్ రెడ్డి లను మహానందీశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలకు రావాలని, ఆహ్వాన పత్రికలు అందజేసారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ఆహ్వాన పత్రిలను అందజేస్తున్న ఇఒ


మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

వాలంటీర్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని డి.కొత్తపల్లె గ్రామానికి చెందిన వాలంటీర్ ఏరువ రమేష్ రెడ్డి(35) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకొని వాలంటీర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, ఎంపిపి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,వైసీపీ నాయకులు ఎంపిటిసి పత్తినారాయణ, శేషు రమేష్,రహమాన్, చిన్నారెడ్డి,ఓబులపతి,ప్రతాప్ ఉన్నారు.



విద్యార్థులతో ఆదర్శ పాఠశాల యాజమాన్యం

నేషనల్ సైబర్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో
ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నేషనల్ సైబర్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో సిరివెళ్ల ఆదర్శ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇస్రత్ బేగం అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్‌కు తమ పాఠశాల నుంచి 146 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 46 మంది విద్యార్థులు నగదు బహుమతి పొందినారన్నారు. 5000 నగదు బహుమతి పొందిన వారిలో నూర్ మొహమ్మద్ ఇంటర్నేషనల్ ర్యాంక్ (8), నాగచరణ్ ఇంటర్నేషనల్ ర్యాంక్(21) ఉన్నారన్నారు. రూ.2500 నగదుబహుమతి పొందిన వారు ఇద్దరు ఉన్నారని, రూ.1250 నగదు బహుమతి ఇద్దరికి, రూ.1000 నగదు బహుమతి ఒకరు పొందారన్నారు. రూ.500 గిఫ్ట్ వొచేర్స్ 30 మంది విద్యార్థులు పొందారన్నారు. రూ.250 నగదు బహుమతి పొందిన వారు నలుగురు అని,రూ.200 నగదు బహుమతి పొందిన వారు ఐదు మంది ఉన్నారన్నారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాలలో గురువారం అభినందించారు.

దొంగ అరెస్టు

ప్రజాశక్తి - ప్యాపిలి

కోవెలకుంట్ల, జలదుర్గం పరిధిలో దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న వడ్డే సుబ్రహ్మణ్యంను(26) గురువారం సాయంత్రం రామకృష్ణాపురం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. సిఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు తనతోపాటు జలదుర్గం ఎస్ఐ విజయ్ కుమార్, సిబ్బంది కలిసి జలదుర్గం, కోయిలకుంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు కేసులలో దొంగతనం చేసిన బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన వడ్డే సుబ్రహ్మణ్యంను అరెస్టు చేశామన్నారు. సుమారు 7 తులాల బంగారు నగలను, 23 తులాల వెండి పట్టీలు, ఒక పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపామన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సిఐ సుధాకర్ రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారం : సర్పంచి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని ఎర్రగుంట్ల గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ కె.శ్వేతకుమారి, వైసిపి నాయకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పరిష్కరించారు. కొత్తగా పైపులైన్లను ఏర్పాటు చేసి నూతన మోటర్‌తో కాలనీకి నీటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం కావడంతో భూగర్భ జలాలు తగ్గి తాగునీటి సమస్య ఏర్పడుతుందని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు. సాంకేతిక అంతరాయాల వల్ల తాగునీటి సమస్య ఏర్పడినప్పుడు గ్రామంలోని ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అయేషా, టెక్నికల్ అసిస్టెంట్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

